క్లుప్తంగా

వాచ్‌మన్ కుటుంబానికి చేయూత



గ్యాస్ స్టవ్, సిలిండర్ అందజేస్తున్న ఎంపీపీ

డోన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న రంగన్న కుటుంబానికి వాకర్స్ అసోసియేషన్ సోమవారం గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను విరాళంగా అందజేసింది. న్యాయవాదులు జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి ఆర్థిక సహాయంతో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామలింగయ్య, రవిప్రకాష్, క్రిష్ణమూర్తి, లక్ష్మన్న, జబీబుల్లా, వెంకట్రాముడు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



రఘునందన్‌ను సత్కరిస్తున్న సబ్‌ట్రెజరీ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు

డోన్: రాష్ట్రంలోని సబ్‌ట్రెజరీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏపీ స్టేట్ సబ్‌ట్రెజరీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి రఘునందన్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా డోన్ పెన్షనర్స్ అసోసియేషన్‌తో పాటు ట్రెజరీ ఉద్యోగులు సోమవారం రఘునందన్‌ను ఘనంగా సత్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్, అసోసియేషన్ నాయకులు గాలయ్య, గోపాల్, నరసింహులు, రామచంద్రుడు, రామక్రిష్ణారెడ్డి, సుబ్బరాయుడు, ట్రెజరీ ఉద్యోగులు ప్రేమ్‌కుమార్, నాయక్, భాస్కర్, జగదీష్ పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న సంఘం నాయకులు

డోన్ టౌన్: విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆవోపా అధ్యక్ష కార్యదర్శులు మాకం రంజిత్ కిరణ్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొ్ట్రికె హరికిషన్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500 మార్కు లకుపైగా సాధించిన 19 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు స్థానిక అమ్మవారిశాలలో సోమ వారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రతిభ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చు జయశీలగుప్త, ఆవోపా కోశాధికారి శేగు సుదర్శన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత



పిచ్చిమొక్కలను తొలగింపజేస్తున్న సర్పంచ్

డోన్: వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కన్నపకుంట సర్పంచ్ కల్యాణి అన్నారు. కాలువల్లో పూడికతీత, రోడ్డు పక్కల పిచ్చిమొక్కల తొలగింపు పనులు సాగుతోందని తెలిపారు. పచ్చదనం .. పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం నుంచి పలుమార్లు రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న కల్యాణి పనితీరును గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

పార్కు వ్యవహారంపై నిగ్గు తేల్చండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

డోన్: పట్టణంలోని నెహ్రూ నగర్‌లో స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్‌ను కొందరు హైకోర్టు ఆర్డర్ ఉందనే నెపంతో మూసివేయడంపై ఎలాంటి చర్యలు చేపట్టారో ప్రజలకు వివరించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, వార్డు కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మిట్టా రవికుమార్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కోరారు. వాకింగ్ ట్రాక్‌పై వెళ్లేందుకు ప్రయత్నించే వారిని కోర్టు స్టే ఉందంటూ కొందరు వాకింగ్, స్విమ్మింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. తారకరామనగర్, నెహ్రూనగర్, సుందర్‌సింగ్ కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

మస్టర్ల మాయాజాలం..!

- ఉపాధిహామీలో అడుగడుగునా అక్రమాలు
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఫీల్డ్ అసిసెంట్స్
- రెండు మస్టర్‌లకు ఒకే ఫొటో అప్‌లోడ్
- ఇంటి దగ్గర ఉంటున్న టీడీపీ నాయకులకు హాజరు

సంజామల మండలంలో కూలీల వివరాలు	
జాబ్‌కార్డులు	7620
కార్డులోని కూలీలు	13829
యాక్టివ్ జాబ్‌కార్డులు	6169
యాక్టివ్‌గా ఉన్న కూలీలు	10560



కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సంజామల: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అడుగడుగునా అక్రమాలు బటయపడుతున్నాయి. ముఖ్యంగా సంజామల మండలంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ పాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన కూటమి నాయకులు తమకు అనుకూలమైన కార్యకర్తలను నియమించి అక్రమాలకు తెరలేపుతున్నారు. అధికార పార్టీ అండదండలతో ఫీల్డ్ అసిసెంట్స్, మేటీలు బోగస్ కూలీల పేరుతో ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేస్తున్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిసెంట్స్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇంటి దగ్గర ఉన్న కూలీలలకు హాజరు వేసి నీకు సగం నాకు సగం అన్నట్లుగా ఫీల్డ్ అసిసెంట్స్ వ్యవహరిస్తున్నారని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు.

ప్రతి రోజు అదనంగా 50 కూలీలకు హాజరు

రెడ్డిపల్లె గ్రామంలో ప్రతి రోజు ఉపాధి హామీ పనికి రాకున్నా సుమారు 50 మంది కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ 180 నుంచి 190 మంది పనులకు వెళ్తుంటే ప్రతి రోజు 250 వరకు హాజరువేస్తున్నారు. గ్రామంలో టీడీపీ నాయకులకు సైతం హాజరు వేస్తున్నారని సమాచారం. వారం రోజులు పనిచేస్తే 2 రోజులే పనిచేసినట్లు చూపిస్తున్నారని పలువురు ఉపాధి కూలీలు ఉంటున్నారు. తాము చేసిన పనికి ఇంటి వద్ద ఉంటున్న వారికి హాజరు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు.

బోగస్ మస్టర్లతో నిధులు పక్కదారి

గ్రామంలో బోగస్ మస్టర్లు వేసుకుని ఉపాధి హామీ, మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్స్ అందరూ కుమ్మక్కై నిధులు స్వాహా చేస్తున్నారు. మే 30వ తేదీ మస్టర్‌లో రోల్ 4513లో ఐదుగురుకి హాజరు వేయగా ఫొటో మాత్రం నలుగురు ఉన్నది అప్‌లోడ్ చేశారు. ఆ ఫొటోలో గ్రామ టీడీపీ నాయకుడితో పాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అదే ఫొటోను మస్టర్ రోల్ 4514, 4515లో అప్‌లోడ్ చేయడం అక్రమాలకు అద్దం పడుతుంది. గ్రామ టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులకు మస్టర్‌లో హాజరు వేయడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామన్య కూలీలు పని చేస్తుంటే వారి స్థానంలో టీడీపీ నాయకులకు ఎలా హాజరు వేస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఆకుమల్ల గ్రామనికి చెందిన ఓ తాపీమేస్త్రీ కూలీలంతా ఇంటికి వెళ్లాక టీడీపీ నాయకులను పిలుచుకుని హాజరు వేస్తున్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే ఆ వారం పని బంద్

గ్రామంలో ఉపాధిహామీ పథకంలో జరిగే అవినీతిని ప్రశ్నిస్తే వచ్చే వారం నుంచి డిమాండ్‌లో పేరు రాకుండా చేస్తున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉన్న ఎస్సార్‌బీసీ కాల్వలో పూడికతీత పనులు చేస్తున్నారు. వారంలో 6 రోజులు రానుపోను 6 కి.మీ నడిచి వెళ్లి పనులు చేస్తుంటే రెండు రోజుల మాత్రమే పనికి వచ్చినట్లు చూపుతున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నిస్తే పనులు కల్పించమని బెదిరిస్తున్నారని కూలీలు వాపోతున్నారు.



మస్టర్ నంబర్ 4513కి అప్‌లోడ్ చేసిన ఫొటో. నలుగురే ఉన్నా ఐదుగురికి వేసిన హాజరు



అదే కూలీలు ఉన్న ఫొటోను 4514కి అప్‌లోడ్ చేసిన దృశ్యం

వారం పనిచేస్తే ఒక్క రోజే హాజరు



నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. ప్రభుత్వ ఉద్యోగం రాక వ్యవసాయం చేసుకుంటున్నాను. వేసవి కాలం కావడంతో ఉపాధి హామీ పథకం కింద ప్రతి రోజు పనికి పోతున్నా. కానీ హాజరులో కోత విధిస్తున్నారు. ఓ వారంలో 6 రోజులు పని చేస్తే ఒక రోజు హాజరు వేశారు. ఇదేం అన్యాయం అని అడిగితే టెక్నికల్ ప్రాబ్లం అని చెబుతున్నారు. చదువుకున్న నాకే ఇలాంటి సాకులు చెబుతుంటే ఇక చదువురాని మహిళల పరిస్థితి ఏంటి. మోసమని ప్రశ్నిస్తే మరుసటి వారం నా పేరు మస్టర్‌లో రాలేదని చెప్పి పని కల్పించలేదు.

–తిరుపాలు, ఉపాధి కూలీ, రెడ్డిపల్లె

ప్రతి నెలా కోతలే



రెడ్డిపల్లె గ్రామం నుంచి సుమారు 3 కిలోమీటర్లు నడిచి ఉపాధి పనికి పోతున్నా. కష్టపడి పని చేసినా ఫలితం లేకుండా పోతోంది. నెలకు సుమారు 10 రోజులు కోత విధిస్తున్నారు. ఎందుకని అడిగితే కంప్యూటర్‌లో తప్పులు జరిగినాయి అంటున్నారు. ఒక వైపు కూలీ డబ్బులు నెల అవుతున్నా పడడం లేదు. మరో వైపు చేసిన పనుల్లో కోత విధిస్తున్నారు. ఇట్లాగైతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి.

–లైసక్క, రెడ్డిపల్లె

ఇంటి వద్ద ఉంటున్న వారికీ హాజరు



పని చేసిన వాళ్లకు కూలీలు తక్కువ వేస్తున్నారు. ఇంటి దగ్గర ఉన్నావారికి హాజరు వేస్తున్నారని అంతా మాట్లాడుకుంటున్నారు. నాకు వారంలో మూడు రోజులు కూలి తీసేశారు. పనిచేసిన తర్వాత వారంలో విషయం తెలిసింది. కష్టపడి పనిచేసిన ప్రయోజనం ఏముంది. మాలాంటి వాళ్లను మోసం చేస్తే పుట్టగతులు ఉండవు. అధికారులు స్పందించి మాకు కోత కోసిన కూలి డబ్బును అందించేలా చర్యలు తీసుకోవాలి.

–పుల్లక్క, రెడ్డిపల్లె

అవినీతిపై విచారణ చేయాలి



గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద టీడీపీ నాయకులకు హాజరు వేస్తున్నారు. పేదలు పని చేసినా కోత విధించడం దుర్మార్గం. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో అవినీతికి పాల్పడుతున్నారు. ఆడిట్ జరుగుతున్నా వారి ఆగడాలు ఆగటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి విజిలెన్స్ విచారణ జరపాలి.

–నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, రెడ్డిపల్లె

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



గ్రామంలో ఉపాధి హామీ పథకంలో వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఎవరైతే పనికి పోతారో వారికే హాజరు వేయాలి. ఇంటి దగ్గర ఉన్నవారికి హాజరు వేయకూడదు. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి ఉపాధి కూలీలకు న్యాయం చేస్తాం.

–జయంతి, ఏపీఓ, సంజామల

సూచికలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆ శాఖ అధికారులు ఎట్టకేలకు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. రహదారి పలుచోట్ల దెబ్బతినడంతో ఇటీవల కొన్ని చోట్ల కొత్తగా బీటీ రోడ్డు వేశారు. పట్టణ శివారులోని అంకాలమ్మ చౌరస్తా, ఎక్సైజ్ స్టేషన్, స్వామినగర్, గురుకుల పాఠశాల, తదితర ప్రాంతాల్లో రోడ్డుపై కొత్తగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రదేశంలో జీబ్రాలైన్లు (తెల్లటి చారలు), రాత్రి సమయాల్లో కన్పించే విధంగా సిగ్నల్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల సాక్షిలో ‘స్పీడ్ బ్రేకర్లతో డేంజర్’ అన్న శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.



ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో వేసిన జీబ్రాలైన్లు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట స్పీడ్ బ్రేకర్ వద్ద ఏర్పాటు చేసిన సూచికలు

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



వంట నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో వంట నిర్వాహకులు శుభ్రతతో పాటు నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్న భోజన పథకం త్రిసభ్య కమిటీ చైర్మన్ తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇంటి భోజనం మరిపించేలా రూచిగా తయారు చేసి పిల్లలకు వడ్డించాలన్నారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వంట నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వంట తయారీలో పాటించాల్సిన మెలకువలు, శుభ్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వంట పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ స్వరూప, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ–2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయంలో కాటసాని పూజలు

బనగానపల్లె: రాళ్లకొత్తూరు గ్రామంలో సోమవారం లక్ష్మీ చెన్నకేశవస్వామి ధ్వజ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

అవుకు: గోకులదిన్నె గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని గ్రామస్తుడు కృష్ణమూర్తి ఎంపీడీఓ వెంగన్నకు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 50 మందికి పైగా ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ మాధవరెడ్డి పనులు కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు.

వీధికుక్కలకు కు.ని ఆపరేషన్లు

డోన్: కొంత కాలంగా పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కల సంఖ్యను నియంత్రించేందుకు ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. వీధికుక్కల సంఖ్య నానాటికి పెరిగిపోతుండడం, కుక్క కాటు కేసులు అధికం కావడంతో వాటిని పట్టుకుని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ ఆధ్వర్యంలో సుమారు 20 కుక్కలను పట్టుకున్నారు. వీటిని కర్నూలు పశువైద్యశాలకు తరలించి కుటుంబ నియంత్రణ చికిత్స అనంతరం వదిలిపెడతామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారం పాటు కుక్కల వేట కొనసాగుతుందన్నారు. ఒక్కో కుక్కకు రూ.1,300 చొప్పున మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.



బోనులో బంధించిన కుక్కలు

సబ్సిడీపై పశువుల దాణా

డోన్: పశు సంపద పెంపొందించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై దాణా అందజేస్తోందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని యు కొత్తపల్లె గ్రామంలో సోమవారం 50 శాతం రాయితీతో సమీకృత దాణాను పాడిరైతులకు అందజేశారు. 50 కేజీల దాణా కిట్టు రూ.1110 ఉండగా, 50 శాతం సబ్సిడీతో కేవలం రూ.555కు పాడి రైతులకు అందజేస్తామని చెప్పారు. మొదటి విడతగా ప్రాంతీయ పశువైద్యశాలలకు 60 సంచులు, చనుగొండ్ల 50, యు కొత్తపల్లెకు 60, కొచ్చెర్వుకు 50 సంచుల దాణ మంజూరైందన్నారు. దీన్ని తాపిస్తే పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు.

వ్యవసాయ బోర్లే దిక్కు

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామంలో వారం నుంచి తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బోరుబావికి సరఫరా అయ్యే విద్యుత్ లైన్ దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో నీటి సరఫరా లేకపోవడంతో చిన్నపెద్దా అందరూ బిందెలు తీసుకుని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థతి ఏర్పడింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ లైన్ మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పొలంలోని బోరు వద్ద నీరు పట్టుకుంటున్న నాగమళ్లకుంట గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: వెల్దుర్తి 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని ఏఈ వెల్లడించారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 232వ ర్యాంకు



అల్లె ధరనీష్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన అల్లె సుదర్శన్‌రెడ్డి, అమృతదేవి దంపతుల కుమారుడు అల్లె ధరనీష్‌రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 232వ ర్యాంకు సాధించాడు. తండ్రి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా తల్లి గృహిణి. చెన్నై ఐఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు చేయడమే లక్ష్యమని విద్యార్థి తెలిపాడు. ధరనీష్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో జ్యేష్ట మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు.

రేపు వెన్నుపోటు దినం

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాటసాని రామిరెడ్డి స్వగృహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాలకు పొడిగించాలి

కోవెలకుంట్ల: తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును కడప నుంచి నంద్యాల వరకు పొడిగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో పగటి వేళల్లో రైళ్లు లేవన్నారు. తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప నుంచి నంద్యాల వరకు పొడిగిస్తే రెండు జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం సులభతరమవుతుందన్నారు. అయితే ఈ రైలును నంద్యాలకు కాకుండా అనంతపురం జిల్లా గుత్తి మీదుగా గుంతకల్లు వరకు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరమన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాకుండా రైల్వేశాఖ ఆదాయం కోసం పనిచేసే దిశగా ఆలోచించడం విచారకరమన్నారు. ఈ మార్గంలో నంద్యాల నుంచి రేణిగుంట వరకు నడుస్తున్న డెమో రైలుకు ఇదే సమయంలో రేణిగుంట నుంచి నంద్యాల వరకు మరో రైలు నడిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర గిడ్డంగులు, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్లు బాబుల్ రెడ్డి, ముర్తుజావలి, ఖాజా హుసేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు మురళీధర్‌రెడ్డి, మురళీకృష్ణ, తిరుమలేశ్వర్ రెడ్డి, జాకీర్ హుసేన్‌తో కలిసి ఈనెల 4వ తేదీ డోన్ పట్టణంలో జరిగే వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేశారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకపోవడం సీఎం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కూటమి సర్కార్ వైఫల్యాలకు నిరసనగా డోన్ పట్టణంలో చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్నీ వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు గూని నాగరాజు, శేఖరయ్య, వెంకిరెడ్డి, దస్తగిరి, శేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మహబూబ్ పాల్గొన్నారు.

భూసమస్యలపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు సమస్యను విన్నవిస్తున్న గోరుమానుకొండ గ్రామస్తులు

బేతంచెర్ల: రీసర్వేలో తమ భూములను తొలగించవద్దని గోరుమానుకొండ గ్రామస్తులు గాజుల హరికృష్ణ, సంజీవ, రామేశ్వర్‌రెడ్డి, హేమ్లా నాయక్, సుబ్బరాయుడు తహసీల్దార్ ప్రకాశ్‌బాబుకు సోమవారం ప్రజా వేదికలో విన్నవించారు. 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హయాంలో అసైన్ మెంట్ కమిటీ ఆమోదంతో 180 మంది రైతులకు డీపట్టాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో ఆ భూములను ఆన్‌లైన్‌లో తొలగిస్తున్నామని నోటిసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో ఉంచాలని విన్నవించారు. సమస్యను జేసీ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.

బ్రిడ్జిపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

డోన్ టౌన్: పట్టణంలో సోమవారం సాయంత్రం మోస్తరు గాలివాన కురిసింది. దీంతో శ్రీరామ థియేటర్ సమీపంలోని ప్లైఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో ఒక కారు, కొన్ని బైకులకు తృటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స్థానికులు, వాహన చోదకులు కలిసి స్తంభాన్ని పక్కకు పెట్టడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.



రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ స్తంభం

రేషన్ పంపిణీ



సిమెంట్ నగర్‌లో రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: సిమెంట్‌నగర్ గ్రామంలోని రేషన్ దుకాణంలో సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. ప్రతి నెలా 15 రోజుల పాటు రేషన్ పంపిణీ చేస్తారని.. కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలోని 2వ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

యజమాన్య పద్ధతులతో వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్యాపిలి: సాగులో మేలైన యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, యాగంటిపల్లె కేవికే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, ఆదినారాయణ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జలదుర్గం, హుసేనాపురం, కొమ్మేమర్రి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ముందస్తు సన్నద్ధతపై రైతులకు అవగాహన కల్పించారు. అరటి, ఉల్లి, టమాట, వేరుశనిగ, కంది, వరి, సజ్జ పంటల్లో సస్యరక్షణ చర్యలు, విత్తన శుద్ధి, తెగుళ్లు, పురుగు మందులు తదితర వాటిపై వివరించారు. భూసార పరీక్షలు చేసుకుని అందుకు అనుగుణంగా పంటల సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఉద్యానవనశాఖ అధికారి కల్యాణి, గొర్రెల పెంపకం శిక్షణా కేంద్రం డీడీ వెంకటరెడ్డి, వ్యవసాయ సహాయకులు లోకేష్, నళిని పాల్గొన్నారు.